

హైదరాబాద్ వార్త

# ప్రాణాలతో చెలగాటం

డేంజర్ రైడ్

జీవితమంటే లెక్కేలేదు.. ప్రాణమంటే తమ చేతిలోనే ఉంటుందిలే అనే అతి అహం.. ఏమీ చేసినా.. ఏమీ కాదు అనే మరింత అతి అహం కొందరిలోనైతే.. మరికొందరు బైకు విన్యాసాలు చేస్తూ.. పెద్దపెద్ద హారన్ శబ్దాలతో దారిలో వెళ్లే పక్క వాహనాలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా తమ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు కొందరు స్టూడెంట్లు. ఔటర్ రింగ్‌రోడ్డు, నెక్లెస్ రోడ్డే కాదు.. నిత్యం ట్రాఫిక్ ఉన్న రోడ్లమీద కూడా ఈ మధ్య బైకుల విన్యాసాలతో రోడ్లపై వెళ్లే మిగతా వాహనదారులను కన్‌ఫ్యూజ్‌చేస్తూ.. అవస్థలకు గురిచేస్తున్నారు. జరుగరాని ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రాణాలను అర్థాంతరంగా పోగొట్టుకుంటున్నారు. ఈ లాంటి ఘటనలు నగరంలో అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి.



**ఖరీదైన బైకులపై కుర్రకారు హల్‌చల్**

**రోడ్లపై వేగంగా దూసుకెళ్తూ హడలెత్తిస్తున్న రైడర్లు**

**ప్రాణాంతక విన్యాసాలతో స్టంట్లు**

**మితిమీరినవేగంతో ప్రమాదాలు**

హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త : కావాల్సినంత డబ్బు.. ఖరీదైన కార్లు, బైక్‌లు.. జీవితాంతం తిన్నా తరగని ఆస్తిపాస్తులు. కాని వారి అల వాట్లు మితిమీరిన వేగం ప్రాణాలమీదుకు వస్తున్నాయి. తను కోరిందే తడవుగా కోట్లు ఖర్చుపెట్టి మరీ ఖరీదైన బైక్‌లు, కార్లు ఇంటి ముందు పెడుతున్నారు. కుమారులకు హితవాక్యాలు చేప్పే సమయం తీరిక వివిఐపిలకు లేదు. వారు అడిగింది తెచ్చి ఇచ్చి తమ డ్యూటీ అయిపోయిందనే భావిస్తున్నారు. కొందరు రాజకీయాలు, వ్యాపారాలు, సినిమాలు ఇలా బిజీ జీవితాలు గడుపుతున్న వివిఐపిలకు తమ కుటుంబ సభ్యులు యాక్సిడెంట్లు, హఠాన్మరణాలు కోలుకోలేని షాక్‌కు గురిచేస్తున్నాయి. కొందరు మద్యం తాగి ప్రమాదానికి గురైతే.. మరికొందరు మితిమీరిన వేగంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై కొందరు ఆకతాయిలు చేసే ప్రమాదకర స్టంట్లతో మిగతా వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. బైక్ రేస్‌లతో పక్క నుంచే అతివేగతంగా దూసుకెళ్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరైతే పోలీసులు గుర్తించకుండా నెంబర్ ప్లేట్ లేని బైక్‌లపై వెళ్తుండడం నిత్యకృత్యమైంది. తమ పిల్లలను అదుపులో పెట్టకుండా తల్లిదండ్రులు గారాబం చేయడంతో ఇంకా రెచ్చిపోతున్నారు. కొందరు ఆకతాయిలు బైక్‌లపై విన్యాసాలు, సర్కస్ ఫీట్లు చేస్తూ పక్కన వెళ్లేవారిని పరేషాన్ చేస్తున్నారు.

**ఒక్కో బైక్‌పై ముగ్గురు..** ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌లపై ముగ్గురు, నలుగురు కూర్చొని ప్రయాణిస్తుండడం ఇటీవల పరిపాటిగా మారింది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడంలేదు. ఔటర్ రింగ్‌రోడ్, నెక్లెస్ రోడ్డు, బంజారాహిల్స్, గచ్చిబౌలి తదితర విశాలమైన ప్రదేశాల్లో నైట్ రైడింగ్, నైట్ రేసింగ్, స్టంట్ రైడింగ్, వీలింగ్, స్టీపీ, బర్న్ ఔట్, హై చేర్, 12 ఓ క్లాక్, రోలింగ్ స్టాఫీ వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీరిని అదుపు చేయాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చిన తల్లిదండ్రులకు తమ పిల్లల బైక్ విన్యాసాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బైక్ రైడర్లలో లైసెన్సు లేని వారి సంఖ్య 50 శాతానికిపైగా ఉంటుందని తెలిసి కూడా పోలీసులు, ఆర్టీఎ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. గ్రేటర్‌లో ఉదయం ఐదు గంటలకు మొదలు కొని రాత్రి 11 గంటల వరకు రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాల నుండి, నగర శివారు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి వెళ్తుంటారు. ఆర్టీసి బస్సులు, కార్లు, ఆటోలు, ప్రైవేటు వాహనాలతో బిజీబిజీగా ఉండే రోడ్లపై యువత చేసే బైక్ విన్యాసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లను సైతం లెక్కచేయకుండా రయ్..రయ్ మంటూ దుసుకెళ్తున్నారు. బైక్‌లపై అతివేగంగా ప్రయాణించేవారిని పట్టుకునేందుకు గతంలో ప్రత్యేక బృందాలు, స్పీడో మీటర్లు ఉండేవి. కానీ అవి ప్రస్తుతం అవి కనిపించకుండా పోయాయి. ఛేజింగ్ చేస్తున్న సమయంలో రైడర్లు ప్రమాదానికి గురైతే తామే బాధ్యులమవుతామని పోలీసులు కూడా ఒక్కోసారి వదిలేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌కు పరిమితం కాకుండా యువత స్పీడుకు కళ్లెం వేయాల్సి ఉంది.

## సినీ కార్మికుల సొంతింటి కలను నిజం చేసిన నేత ప్రభాకర్‌రెడ్డి

**మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ● చిత్రపురి కాలనీలో ప్రభాకర్‌రెడ్డి విగ్రహావిష్కరణ**



మణికొండ చిత్రపురి కాలనీలో సినీ కార్మికుల ఆరాధ్యదైవం ప్రభాకర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి. డైరెక్టర్ శంకర్, ఆర్ నారాయణమూర్తి

నార్సింగి, జూలై 1 ప్రభాతవార్త : సినీ కార్మికుల సొంతింటి కలను నిజం చేసిన మహనీయుడు డాక్టర్ యం.ప్రతాప్‌రెడ్డి అని రాష్ట్ర మంత్రి జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభాకర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకని మణికొండలోని చిత్రపురి కాలనీలో ఆయన విగ్రహాన్ని భార్య, బిడ్డలు, ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి భార్య సంయుక్తను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సినీ కార్మికులకు హైదరాబాద్ నగరంలో సొంతిళ్లు ఇప్పించేందుకు 13.ఏళ్ల పాటు ప్రభాకర్‌రెడ్డి పడిన కష్టం ఫలమే నేడు ఈ చిత్రపురి కాలనీ అని స్పష్టం చేశారు. ఇప్పుడు ఇక్కడ 4.వేల పైచిలుకు ఇళ్లు పూర్తయ్యి సొంతిళ్లల్లో వారుంటుండడం సంతోషంగా ఉందని, ప్రభాకర్‌రెడ్డి ఆత్మ శాంతిస్తుందన్నారు. స్వతహాగా డాక్టర్ అయినా యాక్టర్‌గా మారి హీరో, సైడ్‌హీరో, విలన్ ఇలా అనేక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. సినీ పరిశ్రమలో పని చేసే వారంతా తన కుటుంబ సభ్యులేనని భావించే వారిని, వారి కోసం ఏదైనా చేయాలని పరితపించి నాటి ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డిలను పలుమార్లు సంప్రదించి తను అనుకున్నది సాధించారన్నారు. ఇంతటి మహానటులు, మానవతా వాది నల్గొండ జిల్లాకు చెందిన వారు కావడం గర్వంగా ఉందన్నారు. ఈ చిత్రపురి కాలనీ ఉన్నంత కాలం ఆయన గుర్తుండిపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సినీ పరిశ్రమ అభ్యున్నతికి పూర్తి సహకారం అందిస్తుందన్నారు. అనంతరం ఎంపి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ సినీ పరిశ్రమలోని అందరూ కలిసిమెలిసి ఉండాలని, సమిష్టి నిర్ణయాలతో ముందడగు వేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ నటులు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ పటేల్, పట్వారీ వ్యవస్థను వ్యతిరేకించి తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు దానం చేసిన మానవతా వాదీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన శ్రమ, కృషి వల్లనే నేడు చిత్రపురి కాలనీ ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు మురళీ మోహన్, తమ్మారెడ్డి భరద్వాజ, బషిరెడ్డి, పరుచూరి గోపాలకృష్ణ, చిత్రపురి కాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్, కౌన్సిలర్లు హైమాంజలి, వసంత్‌రావ్ చౌహాన్, కొండకళ్ల రామకృష్ణారెడ్డి, రూపారెడ్డి, బుద్దోలు శ్రీరాములు, కుమార్ పాల్గొన్నారు.

## మెట్రోలో స్టూడెంట్ పాస్‌లు

**20 ట్రిప్పుల చార్జీతోనే 30 ట్రిప్పుల ప్రయాణం**




హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త : విద్యార్థులకు హైదరాబాద్ మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది.విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ మెట్రో రైల్ సరికొత్త ఆఫర్ అందుబాటులోకి తెచ్చింది. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునర్‌ప్రారంభం కావడంతో విద్యార్థుల కోసం శనివారం నుంచి కొత్తగా స్టూడెంట్ పాస్ అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ కార్డ్ రూపంలో ఇది అందుబాటులో ఉండనుంది. ఈ స్యూటెండ్ పాస్ సహాయంతో 20 ట్రిప్పుల చార్జీతోనే 30 ట్రిప్పులు ప్రయాణించవచ్చని పేర్కొంది. అంటే ఈ పాస్ సహాయంతో నెల రోజుల్లో 30 రైడ్‌లు చుట్టేయవచ్చు. ఈ పాస్‌లు 9 నెలల వ్యాలిడిటీతో ఇవ్వనున్నారు. అంటే ఈ ఏడాది జూలై 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఈ పాస్ అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు వివరాలను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ట్విట్టర్‌లో వెల్లడించింది. జెఎన్‌టియూ, ఎస్‌ఆర్నగర్, అమీర్‌పేట, విక్టోరియా మెమోరియల్, దిల్‌సుఖ్‌నగర్ స్టేషన్లలో ఈ మెట్రో పాస్‌ను పొందవచ్చు.ఈ మెట్రో స్టేషన్లలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కాలేజీ ఐడీ కార్డు చూపించి తీసుకోవచ్చునని తెలిపింది.

## భారత్ ప్రపంచంలో కెల్లా ఐదవ ఆర్థిక శక్తిగా నిలబడింది

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**




క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బేగంపేట జులై 1,ప్రభాతవార్త : ప్రపంచం కరోనా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ భారత దేశం మాత్రం ప్రపంచంలో కెల్లా ఐదవ ఆర్థిక బలమైన శక్తిగా నిల్చిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు.ముందుగా జైన్ సమాజ్ మత గురువుల ఆశీర్వాదం తీసుకున్న కిషన్ రెడ్డి అనంతరం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.అనంతరం శ్రీసిక్ వాలా బ్రహ్మాన్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ శివ పంచాయతన్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్యారడైజ్ వద్ద ఏర్పాటు చేసిన రాణిగంజ్ మెటల్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులతో ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెల్సుకున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పనితీరు ప్రశంసనీయమని అన్నారు.ప్రపంచ దేశాలు మోడీ వైపు చూస్తున్నాయని, దేశ ప్రజలంతా మోదీ పాలనలో శాంతి భద్రతలతో ఉన్నారని, అన్నారు.గతంలో దేశంలోని ప్రధాన నగరాలలో ఉగ్రదాడులు జరిగేవని, మోదీ ప్రధాని అయ్యాక ఉగ్రదాడులు అరికట్టారని అన్నారు.ఈ సందర్భంగా జైన్ సమాజ్,అగర్వాల్ సమాజ్,సిక్ వాలా సమాజ్ ల ప్రజలతో మరో సారి మోదీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కిషన్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్,రాంగోపాల్‌పేట కార్పోరేటర్ ,చీరె సుచిత్రా శ్రీకాంత్,చీరె సత్యనారాయణ కార్పోరేటర్లు సరళ,కొంతం దీపికలు పాల్గొన్నారు.

**ఇకనైనా దళితబంధులో మాలలకు న్యాయం చేయండి**

నాంపల్లి, జూలై 1 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు మొదటి విడతలో మాలలకు, నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని, త్వరలో విడుదల చేసే దళితబంధు జాబితాలో మాలలకు, అర్హులైన నిరుపేద దళితులను చేర్చి సరైన న్యాయం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ శాసనసభ్యుల్లో ఎక్కువగా మాదిగలే ఉండడంవల్ల వారికే నూటికి 90శాతం దళితబంధు దక్కిందని, వారూ తమ మిత్రులే అయినందుకు ఆనందంగావున్నా నిరుపేదలైన మాలలకు అవకాశం దక్కక తీరని అన్యాయం జరిగిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సిద్ధం కావాలి

**ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపు**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.బాల్‌రాజ్

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికలోకం సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఇటీవల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక విధానాలపైన, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ప్రదానమైన సమస్యలపై జులై, ఆగస్టు మాసాల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి ఉద్యమాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కమిటి నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆఫీసర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఇటీవల జరిగిన కార్యకలాపాలతోపాటు చేపట్టవలసిన కర్తవ్యాలపై నివేదికను సమావేశానికి సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధాలను అవలంబిస్తూ, 29 కార్మిక చట్టాలను సమూలంగా మార్చుతూ 4 కోడ్‌లుగా విభజించి హక్కులను కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మార్చుతున్నదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న ందని, ప్రజలపై పెనుభారం మోపుతూ తమ విద్వేషాలను రెచ్చగొడుతూ తిరిగి అధికారంలోకి రావడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నదని సమావేశం ధ్వజమెత్తింది. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించి అన్ని రంగాలకు విస్తరించి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నదని, కనీస వేతనాల అమలుకు రాష్ట్ర స్థాయి కనీస వేతనాల బోర్డును వేయకుండా కాలయాపన చేస్తూ తమ పార్టీకి అనుకూలమైన వారిని వేసుకుని ప్రధాన కార్మిక సంఘాల ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 9న కేంద్ర ప్రభుత్వ విధానాలపైన, 15 డిమాండ్ల అమలు కోసం ఆగస్టు 9,10 తేదీలలో జరిగే మహాపడావ్‌ను జయప్రదం చేయాలని సమావేశం కార్మికులకు పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఎఐటియుసి నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, బి.చంద్రయ్య, ఏసురత్నం, ప్రేమ్‌పావని, రాజిరెడ్డి, ఎం.నర్సింహ్మా, విలాస్, బి.వెంకటేశ్, ఎన్.కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుత తరుణంలో ఆధ్యాత్మికత లోపిస్తుంది

**వెంకయ్య నాయుడు**



బోయిన్‌పల్లిలో శ్రీ మహా విష్ణుమూర్తి శిల్పావిష్కరణలో భారత మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు తదితరులు

కంటోన్మెంట్, జులై 1 ప్రభాతవార్త: మన దేశ సంస్కృతి సం ప్రదాయాలను తెలియజేయాలి ్సన అవసరం భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. శనివారం కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లి అనురాధ టింబర్ ్స ఇంటర్నేషనల్ వారి ఆధ వ్ర్యంలో రూపుదిద్దుకున్న అతి పెద్ద అనంత శేషాయణ శ్రీ మహావిష్ణుమూర్తి ఏకాండి దారు శిల్పావిష్కరణకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో ఆధ్యాత్మికత లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులు కమర్షియల్‌గా మారడం అందుకు కారణమన్నారు. కళలకు ఎల్లలులేవని, చిత్రకళలకు మన దేశం పుట్టినిల్లు అన్నారు. వ్యాపార వాణిజ్యరంగ దృష్టిలో చూడకుండా కళా రూపంగా ఆలోచించి దృడసంకల్పంతో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన అనురాధ టింబర్ ఎస్టేట్ నిర్వాహకుల పనితీరు ఆయన అభినందించారు. దేశ నాగరికత కళా సంగీత సాహిత సంపదను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు చాటి చెప్పాలన్నారు. 21 అడుగుల వెడల్పు,8.5 అడుగుల ఎత్తు ఉన్న బారీ టేకు దుంగను మయన్‌మారలో 45 దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ వేలంలో అనురాధ టింబర్ ్సయజమాని శరత్ బాబు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. గుంటూరు చెందిన ఆర్టిటిస్ట్ గిరిధర్ గౌడ్, స్కెచ్ గీశారని తెలియజేశారు. దుంగరూపంలో తీసుకువచ్చే పరిస్థితి లేకపోవడంతో అక్కడి ఆర్టిస్ట్ యు.కె.స్వార్కీ స్కెచ్ పంపీ చెక్కించాలని చెప్పడంతో 700 సంవత ్సరాల నాటి అరుదైన వృక్షంతో శ్రీదేవి, భూదేవి, చతుముఖ, బ్రహ్మ తదితర రూపాలను చెక్కించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఈ టేకు దుంగలో డోర్లు,కిటికీలు, ఇతర సామాగ్రి రూపంలో మార్చదు అనే ఉద్దేంఈ ఆలోచన చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనురాధ టింబర్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్ రావ్, శ్రీనివాస్ రావ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్స్‌లో నార్కోటిక్ డ్రగ్స్ సరఫరా

**హాస్టల్స్ నిర్వాహకుల సమావేశంలో కాలనీవాసుల ఆగ్రహం**

యూసుఫ్‌గూడ, జులై 1, ప్రభాతవార్త : మధురానగర్ కాలనీలోని కొన్ని హాస్టల్స్‌లో నార్కోటిక్ డ్రగ్స్ సరఫరా అవుతున్నాయంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాస్టల్స్ నిర్వాహకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలువురు కాలనీ ప్రతినిధులు హాస్టల్స్ నిర్వాహకుల తీరుపై మండిపడ్డారు. కాలనీలో దాదాపు 43హాస్టల్స్ ఉండగా వాటిలో 80శాతం హాస్టల్స్ నిర్వాహకులు ఎలాంటి నియమ నిబంధనలను పాటించడం లేదని దుయ్యబట్టారు. గత కొంతకాలంగా మత్తు పదార్థాలు కూడా హాస్టల్స్‌లో నిల్వ ఉంచుతూ పోలీసులకు కూడా దొరికిన సందర్భాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతూ అదేమని ప్రశ్నిస్తే దాడులకు కూడా పాల్పడుతున్నారన్నారు. సిగరెట్లు, మద్యం సేవిస్తూ పక్కనే ఉన్న రెసిడెన్షియల్స్‌లోకి వేస్తున్నారని అన్నారు. పదేళ్ల కిందట ఎంతో ప్రశాంతంగా ఉండే కాలనీ నేడు లవర్స్ పార్కులా, రెండో రకం పబ్బులా తయారైందని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్స్‌కు చెందిన బిల్డింగ్ యజామానులు కేవలం అద్దెలు మాత్రమే వసూలు చేసుకుంటూ విదేశాల్లో, వివిధ రాష్ట్రాల్లో ఉంటూ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం వల్లనే ఇక్కడ నిర్వాహకులు ఇష్టానుసారంగా నడుపుతున్నారని మధురానగర్ కాలనీ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే కాలనీ అసోసియేషన్ నేతలు స్పందించి నిర్వాహకులకు పకడ్బందీ సూచనలు వేసి అమలయ్యేలా చూడాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తిలు మాట్లాడుతూ హాస్టల్స్‌లో పార్కింగ్‌లు లేవని, సిల్ట్ ఛాంబర్స్ ఏర్పాటు చేసుకోలేదని, మత్తు పదార్థాల విషయంపై ఇప్పటికే తమకు ఫిర్యాదులు అందాయని ఇకనైనా నిర్వాహకులు పోలీసులు, జిహెచ్‌ఎంసి ఇచ్చిన నిబందనలను పాటించాలని లేనిపక్షంలో అసోసియేషన్ తరపున చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నేతలు, కాలనీనేతలు, రవికుమార్, రాజన్‌బాబు, ఉప్పలయ్య, రాజేంద్రప్రసాద్, సుధాకర్, సుగుణ, పి.ఎస్.రెడ్డి, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, లక్కీ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, కిశోర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిజాం కళాశాల గేటు ఎదుట పరీక్షలకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థుల ఆందోళన

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: గ్రూపు-4 పరీక్షల సందర్భంగా బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలకు సెంటర్‌కు అలస్యంగా వచ్చిన కొంత మంది అభ్యర్థులు శనివారం కళాశాల గేటు ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతున్నందున అభ్యర్థులు 9 గంటల 45 నిమిషాలలోపు రావాలని ఈ మేరకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చాలా మంది అభ్యర్థులు 9 గంటల 45 నిమిషాలలోపు నిజాం కళాశాలకు చేరుకున్నారు. కాగా కొంత మంది అభ్యర్థులు వివిధ కారణాల వల్ల 9గంటల 45 నిమిషాల తరువాత అలస్యంగా కళాశాలకు చేరుకున్నారు. దీంతో వారికి అధికారులు లోనికి ప్రవేశం కల్పించలేదు. తీవ్ర మనస్తాపానికి గురైన అభ్యర్థులు ఆందోళనలు వ్యక్తం చేశారు. పోలీసులు అభ్యర్థులను అక్కడి నుంచి పంపించివేశారు. .

## వ్యతిరేక పరిస్థితుల నుంచి శిఖరంగా ఎదిగిన ఆచార్య ఇనాక్ గొప్ప ఆదర్శమూర్తి

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**



ఆచార్య ఇనాక్ రచించిన 'వ్యాస పరిణామం' పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి తదితరులు

చిక్కడపల్లి, జులై 1 ప్రభాతవార్త: నాడు సమాజంలో ఉన్న వివక్షతల వ్యతిరేక పరిస్థితులు నుంచి ఆచార్య కొలకలూరి ఇనాక్ శిఖరంలా ఎదిగిన గొప్ప ఆదర్శ మూర్తి ఆచార్య కొ ల క ూ ల ూ రి ఇనాక్ అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ డాక్టర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం తొలి రోజు ఆచార్య ఇనాక్ రచించిన 'వ్యాస పరిణామం' పరిశోధనా గ్రంథాన్ని డాక్టర్ కె.వి.రమణాచారి ఆవిష్కరించి ప్రసంగించే కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఒక వ్యక్తిగా, శక్తిగా, అధ్యాపకుడిగా, ఆచార్యులుగా వివిధ స్థాయిలో రాణిస్తూ తనతోపాటు తన చుట్టూ ఉన్న వారిని ప్రోత్సహించారన్నారు. తెలుగులో వెలువడిన వ్యాసాలను పరిశోధన అంశం గ్రహించడం ఇనాక్‌లో ఉన్న సృజనాత్మకతకు నిదర్శనమని అన్నారు. సాహితీవేత్త ఆచార్య గౌరీశంకర్ మాట్లాడుతూ మట్టిపొరల్లో నుంచి మొలకగా వెలువడి మొక్కగా వటవృక్షంగా ఎదిగిన ఇనాక్ తాను రాసిన ప్రతి అక్షరం కన్నీటి చుక్క అని చెప్పారని అన్నారు. వ్యావహారిక భాషలో పరిశోధన చేయటం సమగ్ర విషయ సేకరణ వ్యాస పరిణామ గ్రంథంలో ద్యోతకమవుతుందన్నారు. పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమన్ తదితరులు పాల్గొనగా మల్లాది ఉష శిష్యబృందం గానగోష్ఠి అందరిని ఆకట్టుకుంది.

## అమ్మకు మనసారే సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

చాంద్రాయణగుట్ట, జూలై 1 ప్రభాతవార్త : ఆషాడమాసం సందర్భంగా త్రిశక్తినారి తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో మన అమ్మకు మనసారే కార్యక్రమంలో భాగంగా శనివారం లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి అమ్మవారికి 80 మంది మహిళలచే సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి బిసి కమిషన్ చైర్మన్ వకులాభరణం, ఆర్యవైశ్య మహసభ అధ్యక్షులు సరాబు లక్ష్మన్ గుప్త, త్రిశకి నారి తరంగిణి సంస్థ అధ్యక్షురాలు యాద మంజుల, కార్యదర్శి గండె సౌజన్యతోపాటు పలువురు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బల్వంత్ యాదవ్, కె.వెంకటేష్, మారుతీ యాదవ్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జాతీయ వైద్యుల దినోత్సవం



వైద్యశిరోమణి అవార్డు గ్రహీతలైన వైద్యులతో మధుసూదనాచారి, వకుళాభరణం, దైవజ్ఞశర్మ, మల్లికార్జున్‌రావు, రాఘవ తదితర అతిథులు

రవీంద్రభారతి, జూలై 1 ప్రభాతవార్త : జీవకోటికి, మనుషులకు ప్రాణంపోసి, మనం అనునిత్యం ఆరాధించే దేవుళ్ల దేవతలు ఆలయాలు, మందిరాల్లో నిశ్చలంగా ఉంటే మన కళ్లముందు కదలాడుతూ ప్రాణాన్ని నిలిపే మూర్తీభవించిన దైవస్వరూపులు వైద్యులని, కనిపించే దైవమని, అందుకే ప్రాణంపోసే దేవుడుకన్నా ప్రాణం నిలిపే వైద్యుడు మిన్న అన్నది ప్రాచీనకాలం నుండి వస్తున్న నానుడని, నిత్యసత్యమని అన్నారు. కొవిడ్ వంటి మహమ్మారి ఆవరించి ప్రజాజీవనాన్ని అల్లకల్లో లంచేసి విశృంఖలనంగా తుదముట్టిస్తున్నా తమ కుటుంబాలను, ప్రాణాలను లెక్కచేయడకుం డా ఫణ్ణం పెట్టి అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడిన ఉదంతాన్ని కళ్లారా చూశామని, ఇంతకుమించిన ప్రజా, సామాజిక, మానవసేవ ఇహలోకంలో మరేదీలేదని వారి నిరంతర సేవకు ఆకాశమే హద్దని డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కొనియాడారు. జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అలాంటి మహోన్నత వైద్యులను వైద్యశిరోమణి అవార్డులతో సన్మానించడం మెగాసిటీ నవకళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావును ఎంతగానో అభినందించారు.

## దళితుల కోసం నాగయ్య చేసిన సేవలు మరువలేనివి

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: దళితుల సంక్షేమం, అభివృద్ధి, హక్కులు సాధన, అమలు కోసం డా.బి.ఆర్.అంబేద్కర్ వాది అయిన డా.కె.నాగయ్య చేసిన సేవలు మరువలేనివని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్ టి.పద్మారావు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఆయన సహించేవారు కాదని దళితులందరిని ఐక్యం చేసి ప్రభుత్వంపైన ఉద్యమించేవారని పద్మారావు గుర్తు చేశారు. శనివారం డా.కె.నాగయ్య 90వ జయంతి కార్యక్రమం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా టి.పద్మారావు మాట్లాడుతూ నాగయ్య చేసిన సేవలను గుర్తించిన ఆనాటి ప్రభుత్వం రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించడం జరిగిందన్నారు. అనేక కమిటిల్లో నాగయ్య సభ్యుడిగా, పలు దళిత సంఘాలకు, ఉద్యోగ సంఘాలకు అధ్యక్షుడిగా కొనసాగారని, అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల రాష్ట్ర కమిటి ఛైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు అందించారని ఆయన వివరించారు. ఈ జయంతి కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్, పంజాగుట్ట అంబేద్కర్ స్టాట్యూ కమిటి అధ్యక్షుడు పుణ్యభానుప్రకాష్, యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి బి.ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నటుడు దర్శకుడు రామకోటేశ్వరరావుకు రంగస్థల పురస్కారం

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

రవీంద్రభారతి, జూలై 1 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని హైదరాబాద్ వారి నిర్వ హణలో ప్రఖ్యాత రంగస్థల నిపుణుడు గరిమెళ్ళ రామమూర్తి 87వ జయంతి వేడుకలను పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో 4వ తేదీ మంగళవారం రాత్రి 6.30గంటలకు ప్రఖ్యాత నటుడు, దర్శకుడు, గుణనిర్ణేత దేవిరెడ్డి రామ కోటేశ్వరరావుకు రంగస్థల పురస్కారం-2023 ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. కె.వి.రమణాచారి విచ్చేసి విశిష్ట అతిథులు తంగెడ కిషన్‌రావు, దుగ్గిరాల సోమేశ్వరరావు, ఓలేటి పార్వతీశం, డా. డి.ఎస్.ఎన్.మూర్తి తదితరులతో కలిసి రామకోటేశ్వరరావును ఘనంగా సత్కరించి రంగస్థల పురస్కారం ప్రదానం చేస్తారని, గరిమెళ్ళ రామమూర్తి పేరుమీద 2005వ సంవత్సరం నుండి రంగస్థల పురస్కారాలను రంగస్థలానికి చెందిన ప్రముఖులకు అందజేయడం జరుగుతుందని, ప్రతీయేటా క్రమం తప్పకుండా గత 18 సంవత్సరాలుగా 18మందికి ఈ పురస్కారాలు బహూకరించడం జరిగిందని, ఇందులో ప్రముఖులు కె.చిరంజీవి, ఎన్.తారక రామారావు, రాళ్ళపల్లి, రావికొండలరావు, తెలంగాణ శకుంతల, డి.ఎస్.ఎస్.మూర్తి, యు.సుబ్బరాయశర్మ, వి.శ్రీశైలమూర్తి తదితరులున్నారని వివరించారు.

## ఆంధ్రనాట్యంలో పదహారేళ్ల సాయినిఖిత అరంగేట్రం



హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త: అభినవ సత్యభామంగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రనాట్యంకు చెందిన ప్రసిద్ధి నాట్యాచారులు ఆచార్య శ్రీకళా కృష్ణ శిష్యురాలు పదహారేళ్ల సాయినిఖిత కాటూరి అత్యంత క్లిష్టమైనదిగా భావించే అతిపురాతన నృత్యసాంప్రదాయం ఆంధ్రనాట్యాన్ని గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తన నృత్యరూపకంతో ప్రేక్షకులతోపాటు గురువులను కూడా అబ్బురపరిచింది. ఈనృత్య ప్రదర్శన కార్యక్రమానికి గౌరవ అతిధులుగా బ్రహ్మకుమారీస్ రిజనల్ సెంటర్స్ ఇంచార్జ్ రాజయేగి కులదీప్‌తోపాటు, కెమెరాన్ ,దర్శకుడైన మీర్ ఎస్, ఆయన సతీమణి భువనేశ్వరి, దక్షిణ భారత చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖ నటీనటుల మధుశాలిని గోకుల్ ఆనంద్‌లు హాజరయ్యారు. రెండుగంటలకుపైగా సాగిన ఈనృత్య ప్రదర్శనలో ఆలయ సంప్రదాయ పుష్పాంజలి నటరాగం- ఆదితాళం, శబ్ద పల్లవి, అరభిరాగం - ఆదితాళం, మహాగణపతే నటరాగం , మయూరం విశ్వనాథ శాస్త్రి ,కృష్ణకైవరం, మోహనరాగం, మజ్జివెంకు నాయుడు రంగనాథ స్వామిపై కీర్తన, భైరవి రాగం -ఆదితాళం ,కోటబ్రమణ్య శాస్త్రీ దేవిస్త్రోత్రం, రాగమాలిక, రూపమ తాళం, పొన్నయ్య పిళ్లై ,తరంగం, మోహనరాగం ఇలా వివిధ విభాల్లో ఆమె ప్రదర్శనలిస్తూ నృత్య బంగివభ ప్రేక్షకుల కరతాల ధ్వనులతో ప్రశంసలను అందుకుంది.

## నాచారంలో ఇంటింటికి బిజెపి కరపత్రాల పంపిణీ



నాచారంలో షాపు యజమానికి కరపత్రాన్ని అందజేస్తున్న మోహన్ రెడ్డి

నాచారం, జులై 1 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్రమోది 9ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై రూపొం దించిన కరపత్రాలను శక్తికేంద్రం ఇంచార్జి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాయకులు ఇంటింటికి పంపిణీ చేశారు. బూత్ నెం.175,178,183 ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వారు ఇంటింటికి షాపులల్లో పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికి బీజేపీకి మంచి స్పందన వస్తుందన్నారు. స్థానిక సమస్యలను ప్రజలు తమకు వివరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు విస్తారక్ అఖిల్ దేవ్, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, ఉప్పల్ మహిళా కన్వీనర్ అనిత రెడ్డి, కార్యదర్శి నవీన్, బూత్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవికాంత్, పాదం, నిర్మల, సాయి, అభిషేక్ గౌడ్, దయాగౌడ్, నవీన్ గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

**పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో..** బూత్ నెం.209,210,215 శక్తి కేంద్రాల్లో శక్తి కేంద్రం ఇంచార్జి, సీనియర్ నాయకులు పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి బిజేపీ కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హన్మంత్, బిరాధర్, నవీన్‌కుమార్, దయాగౌడ్, నవీన్‌గౌడ్, అభిషేక్, నరేష్ నాయక్ తధితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ కోసం చట్టం తీసుకురావాలి : ప్రవీణ్ కుమార్



ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త : రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్కేపురం డివిజన్ భాగ్యనగర్ ఫంక్షన్ హాల్లో బహుజన అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల రక్షణ చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణలో న్యాయవాదులపై నిరంతరం దాడులు కొనసాగడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు డాక్టర్లకు ఇతర రంగాలలోని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపడతామన్నారు. సీఐ, ఎస్ఐలకు పోస్టింగులు కావాలంటే స్థానిక ఎమ్మెల్యే లెటర్ ఇస్తేనే పోస్టింగులు ఇస్తున్నారని అన్నారు. న్యాయవాదుల కార్యాలయాల కోసం బహుజన రాజ్యంలో రూ 5 లక్షల నుంచి రూ 10 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ పటోళ్ల మాధవరెడ్డి, ఫణీంద్ర, భార్గవ్, సతీష్, ప్రవీణ్, ఆనంద్‌గౌడ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించేది వైద్యులే : కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జూలై 1 ప్రభాతవార్త: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీనగర్ డివిజన్‌లో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మంగళను ఘనంగా సత్కరించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ హాజరై సత్కరించి అభినందిం చారు. కార్యక్రమంలో బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, నేతలు వివిఎస్టీ రాజు, పాల శ్రీనివాస్, సత్తిరెడ్డి, అశోక్‌యాదవ్, సుక్క యాదగిరి, దోనేటి సత్యం, బోడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. తమ వైద్య నైపుణ్యంతో వైద్యులు ఎంతో మందికి ప్రాణాలను కాపాడుతూ ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారన్నారు. వృత్తిజీవితంలో నిరంత రమైన ఒతిళ్ళను అనుభవిస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఇతర ఆరోగ్యాన్ని కాపాతున్నారన్నారు.

## విద్యకు బడ్జెట్ కేటాయింపులపై సిఎంతో చర్చిస్తాను: సబితా ఇంద్రారెడ్డి



రాష్ట్ర మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ సుధాకర్

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం బడ్జెట్‌లో 20 శాతం నిధులను కేటాయించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కమిటీ ప్రతినిధి బృందం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కోర్ కమిటి కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థు లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా బాసర ట్రిబుల్ ఐటి, రాజీవ్‌గాంధీ యూనివర్సిటి ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ లో ఇటీవల వివిధ కారణాల వల్ల ఐదుగురు విద్యార్థులు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజన వసతి సౌకర్యాలు మెరుగుపరుస్తూ ఆ కళాశాల్లో సమస్యలపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఆయన కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి ఉన్నత విద్య అవసర మని ఇది మన విద్యార్థులకు అందినప్పుడే సాధ్య మవుతుందని, అందుకే విద్యకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని కోరుతున్నామని ఆయ న తెలిపారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి స్పందిస్తూ ట్రిబుల్ ఐటిలో ఉన్న సమస్యలపై ఇప్పటికే విచారణ జరిపిస్తున్నామని, విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు చేపడతామని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. అలాగే బడ్జెట్ కేటాయింపుల విషయంలో కూడా తెలంగాణ ప్రభుత్వం విద్యపై బడ్జెట్ పెంచడానికి సానుకూలంగా ఉందని ఈ విషయాన్ని సిఎం కెసిఆర్‌తో చర్చిస్తామని మంత్రి హా మీ ఇవ్వడం జరిగిందని సుధాకర్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆప్ ప్రొఫెషనల్ కమిటి కన్వీనర్ డాక్టర్ హరిచరణ్, కోర్ కమిటి సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహమ్మద్ మాజీద్, డాక్టర్ పుట్టా పాండురంగయ్య, అధికార ప్రతినిధులు తేజ, ప్రవీణ్, నాయకులు రాకేష్‌సింగ్, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు రుద్రాక్ష మల్లేష్ తదితరులు ఉన్నారు.

## త్యాగరాయ గానసభలో డాక్టర్ ఎస్‌పి.బాలు జయంతి వేడుకలు

చిక్కడపల్లి, జూలై 1 ప్రభాతవార్త: పద్మభూషణ్ డాక్టర్ ఎస్‌పిబి జయంతి వేడుకలను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు-హిందీ సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు టి.రామోజీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి ఎంప్లాయిస్ అసోసియేషన్ నేత, గాయకుడు విసి.వేణుమాధవ్, ఇండియన్ హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ ఎథినిక్ వియర్, లైఫ్ కోచ్ కొమర్రాజు వాణి, సిటీసివిల్ కోర్టు సూపరింటెండెంట్ పివిపి.అంజనీకుమారి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. గాయకుడు రామోజీ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు జ్యోత్స్న, అపర్ణ, డాక్టర్ ఎం.రాంబాబు, జి.వెంకటరావు, రాజేశ్వరరావు, శారదాదేవి, సరస్వతి, సుష్మిత, సరిత, లక్ష్మీరత్నం, ఎస్.జగదీశ్వర్‌రావు, పి.లక్ష్మణ్‌రావు, రమేశ్‌కుమార్, కృష్ణమోహన్, రామలింగేశ్వరరావు, ఎ.జగదీశ్, పి.ఫణిప్రకాశ్ తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## న్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన 'వ్యాస మంజూష' గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి, జూలై 1 ప్రభాతవార్త: జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో 'కవిశేఖర' జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన 'వ్యాస మంజూష' గ్రంథావిష్కరణ, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ గారికి అంకితోత్సవం, జన్నాభట్ల నరసింహప్రసాద్ కథలు, నవలికలు-పరిశీలనపై పరిశోధన గావించి డాక్టరేట్ పొందిన డాక్టర్ మట్టా హారికకు అభినందన సత్కార కార్యక్రమాన్ని 8న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావుకళావేదికలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత గుదిబండి వెంకటరెడ్డి వివరించారు. ముఖ్యఅతిథిగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంపూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై ఆవిష్కరించి సత్కరిస్తారని, సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, నేటినిజంపత్రిక ఎడిటర్ బైసాదేవదాస్, వెంకటదాసు, కూచిపూడి నాట్యగురువు శేషబట్టార్ రజిత ఆచార్య పాల్గొంటారన్నారు.

## రేపు ఆర్డినెన్స్ పత్రుల దగ్ధం

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: ప్రజలచే ఎన్నికైన ముఖ్యమం త్రి అధికారాలను దొడ్డి దారిన హరించే ఢిల్లీ ఆర్డినెన్స్ జిరాక్స్‌లను జులై 3వ తేదీన సోమవారం దగ్ధం చేయనున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కమిటీ ఇచ్చిన దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తం గా ఆయా జిల్లాల పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహిస్తారని అనంతరం పత్రుల దగ్ధం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఘనంగా రుక్మిణీ సమేత విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల పల్లకి సేవా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య,చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్,పుస్తె శ్రీ కాంత్

చార్మినార్, జులై 1 ప్రభాతవార్త : పాతబస్తీ పురానాపూల్‌లో శు క్రవారం రాత్రి జరిగిన శ్రీ రుక్మిణీ సమేత విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్రహా ల పల్లకి సేవా శోభాయాత్రలో దక్షిణమండలం డిసిపి సాయి చైతన్య, చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర ,మందిరం కమిటి చైర్మన్ పుస్తె శ్రీ కాంత్,వర్కింగ్ ప్రెశిడెంట్ ఠాకూర్ రంజిత్‌సింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సిఐ రామక్రిష్ణ



హాల్‌టికెట్‌పై గెజిటెడ్ సంతకం చేస్తున్న సిఐ రామక్రిష్ణ

దుండిగల్, జూలై 1 ప్రభాతవార్త : దుండిగల్ సిఐ రామక్రిష్ణ తన మానవత్వాన్ని చాటుకున్నారు. దుండి గల్ పిఎస్ పరిధి ఎమ్మెల్లార్ఐటి పరీక్షాకేంద్రంకు గ్రూప్-4 పరీక్ష రాసేందుకు వచ్చిన నలుగురు అభ్యర్థుల హాల్‌టికెట్‌పై గెటిజెడ్ సంతకం లేకపోవడం తో నిర్వాహకులు లోనికి అనుమతించలేదు. గ్రూప్-4 నియమనిబంధనల ప్రకారం హాల్‌టికెట్‌పై గెజిటెడ్ సంతకం చేయించుకోవాలి. దీంతో అభ్యర్థులు దిక్కు తోచని స్థితిలో ఉండగా అక్కడే విధి నిర్వాహణలో ఉన్న సిఐ రామక్రిష్ణ వారి పరిస్థితిని తెలుసుకొ న్నారు. పరీక్ష రాసేందుకు వచ్చేటప్పుడు నియమ నిబంధనలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సిఐ హాల్‌టికెట్‌పై గెజిటెడ్ సంతకం చేసి వారిని పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

## భూదాన్ భూములను పేదలకు పంపిణీ చేయాలని 6న ధర్నా

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: ప్రముఖ సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే భూమిలేని పేదల కోసం సేకరించిన భూములను పేదలకే పంచాలని, అలాగే భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీన ఇందిరాపార్కు ధర్నా నిర్వహిస్తున్నామని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో వందలాది ఎకరాల భూదాన్ భూములు అక్రమణలకు గురవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భూదాన్ భూములు చాలా వరకు అక్రమణలో ఉన్నాయని, రెవిన్యూ అధికారుల అండదండలతో కొంత మంది అక్రమణదారు మోసపూరితంగా తమకు అనుకూలంగా రాయించుకుం టున్నారని ఆమె చెప్పారు. అక్రమణకు గురైన భూదాన్ భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని, గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారికి పట్టాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కమతం యాదగిరి, స్టాలిన్ పడాల నళిని, ఎం.నర్సింహ్మా, బి.వెంకటేశం, ఆర్.శంకర్‌నాయక్, నెర్లకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరే టర్ విజయ్‌కు మార్‌గౌడ్, వివిధ శాఖల అధికారలతో కలిసి శనివారం ఉదయం అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో మార్నింగ్ వాక్‌లో భాగంగా అకస్మి కంగా పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఎమ్మెల్యే మమే కమే వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు డ్రైనేజీ సమస్య, మంచినీటి సరఫరాలో లో-ప్రెషర్, రోడ్ల సమస్య, అవసరమైన చోట నూతన డ్రైనేజీ లైన్‌లు, సిసి రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీవాసులు, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామారావుయాదవ్, రాజ్‌గోపాల్‌నాయుడు, మహేష్‌ముదిరాజ్, సాయి, రూబి, సంతోష్‌చారి, వివిధ శాఖల అధికారులు యాదగిరిరెడ్డి, రమేష్, దుర్గా, రవి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

**హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్**

హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త: డివిజన్‌లోని రాజ్‌మోహల్లాలోగల అంగన్‌వాడీ సెంటర్‌ను హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ శనివారం సందర్శించారు. అక్కడ పిల్లలకు అందిస్తున్న ఆహారం, సౌకర్యాలు గురించి ఆమె అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత టీచర్లపైన ఉందని, వారికి ఏలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మహేష్, మల్లేష్, సందీప్, శేఖర్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖబరస్థాన్‌ను నిర్మించాలన్న దశాబ్ద కలను ప్రభుత్వం సాకారం చేసింది

**మంత్రి తలసాని**



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి

బేగంపేట జులై 1,ప్రభాతవార్త : బేగంపేట ముస్లీం మైనార్టీ సోదరులకు ఖబరస్తాన్‌ను నిర్మించాలన్న దశాబ్ద కలను తెలంగాణా ప్రభుత్వం సాకారం చేసిందని,మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శనివారం బేగంపేట లోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ప్రభుత్వం కేటాయించిన 2ఎకరాల స్థలంలో 3కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఖబరస్థాన్ నిర్మాణ పనులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక కార్పోరేటర్ టి.మహేశ్వరితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా తమ కలను నెరవేర్చిన మంత్రి తలసానికి బస్తీ వాసులు డప్పులు,బాణాసంచ కాల్చి ఘన స్వాగతం పలికారు.తాము ఎన్నో సంవత్సరాల నుంచి చనిపోయిన వారిని ఖననం చేసేందుకు వీలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని,ఖబరస్తాన్ కు స్థలం కేటాయిం చడంతో పాటు నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులకు శంఖు స్థాపన చేసిన మంత్రి కి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసారు.గతంలో అనేక సందర్భాలలో చనిపోయిన వారి ని ఎక్కడ ఖననం చేయాలో తెలియక మృతదేహాలతో ఆందోళణ నిర్వ హించామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.అలాంటి ఇబ్బందులు తొలగి పోయేటట్లు చేసిన మంత్రికి ముస్లీం మైనార్టీలు పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 50సంవత్సరాల నుంచి ప్రభుత్వాలను,ప్రజా ప్రతినిదులను ఖబరస్థాన్ కు స్థలం కేటాయించా లంటూ ముస్లీం సోదరులు వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. విషయం తనకు తెలియడంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్,మున్సిపల్ శాఖా మంత్రి కెటిఆర్ ల దృష్టికి తీసికెళ్లినట్లు మంత్రి చెప్పారు.ముఖ్యమంత్రి కే సీ ఆర్ ఆదేశాల మేరకు ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో స్థలం కేటాయించి నిర్మాణం కోసం 3 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.అవసరమైతే ఇంకా అదనపు నిధులు కూడా మంజూరు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ ప్రాంతంలోని అన్ని రోడ్ల నిర్మాణంతో పాటు అవసరమైన అభివృద్ధి ప నులు చేపట్టి ఓల్డ్‌కస్టమ్స్ బస్తీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి శ్రీహరి, జోనల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి,ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ సీజీఎమ్ ప్రభు,బస్తీ వాసులు వాహిద్,అబ్బాస్,సలీంఖాన్,ఆరీఫ్,బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి,నరేందర్,శేఖర్,శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## వైద్యులను సమాజంలో దేవుడిగా కొలుస్తారు



పర్వత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానిస్తున్న బిజెపి నాయకులు మాధవరం కాంతారావు

యూసుఫ్‌గూడ, జులై 1, ప్రభాతవార్త : వైద్యులను సమాజంలో దేవుడిగా కొలుస్తారని వారిని అన్ని వేళల గౌరవించడం మన బాధ్యత అనీ బిజెపి సీనియర్ నాయకులు నియోజక వర్గం ఇన్‌చార్జ్ మాదవరం కాంతారావు అన్నారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా పర్వత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డివిజన్ బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ పులిగోళ్ళ శ్రీలక్ష్మీ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యులను సన్మానించారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బిజెపి ఓబిసి ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొంతు హారికృష్ణ, ఉపాధ్యక్షులు శ్రావణ్, కోశాధికారి సాయిచంద్, అంకిత్ సింగ్, అబిషేక్, సైదయ్య, రామకృష్ణ, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 128/2/3లో ఉన్న స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు: బాధితులు

యూసుఫ్‌గూడ, జులై 1, ప్రభాతవార్త : శ్రీరామ్‌నగర్ ప్రాంతంలోని జయంతి నగర్‌లో సర్వేనెంబర్ 128/2/3 లో ఉన్న స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమిం చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. 2006లో తాము ఈస్థలాన్ని కొనుగోలు చేశామని బి సురేష్‌బాబు ఎమ్‌డి రహీమ్ 4వందల గజాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నామని వై భాస్కర్ ఎమ్‌డి మోసిన్ 128గజాలు, ఎమ్‌డి మునావర్ 212 గజాలు, షేక్ హాఫీజ్ 212 గజాలు తీసుకున్నామని వీటన్నింటికి ఎల్ఆర్ఎస్‌కు కూడా చెల్లించామని 2006నుంచి తాము పొజిషన్‌లో ఉండగా 2008లో ఎమ్‌డి గౌస్ అనే వ్యక్తి ఎలాంటి సంబంధం లేకపోయిన ఆస్థలం తనకే చెందుతుందని తప్పుడు ప్లాట్ నెంబర్ తప్పుడు సర్వేనెంబర్‌లను చూపిస్తూ అధికా రులను పోలీసులను తప్పుదోవ పట్టిస్తూ తమను వేదింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

### ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలి

యూసుఫ్‌గూడ, జులై 1, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని జూబ్లీహిల్స్ నియోజక వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పోరేటర్ జి.మురళీ గౌడ్ కోరారు. ఈసందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో భారీ బహిరంగ సభను ఏర్పాటుచేయడం జరిగిందని కాంగ్రెస్ అభిమానులు నాయకులు కార్యకర్తలు నియోజకవర్గం నుంచి పెద్ద మొత్తంలో తరలి రావాలని విజ్ఞప్తిచేశారు.

## డాక్టర్ల సేవలు అమోగం : జంపనప్రతాప్



డాక్టర్లను సన్మానిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, జులై 1 ప్రభాతవార్త: కరోనా విప త్కర పరిస్థితుల్లో డాక్టర్ల ప్రాణాలను లెక్క చేయకుండా రోగాల ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్ల సేవలు వెలకట్టలేనివని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అంతర్జాతీయ డాక్టర్స్‌డే ను పురస్కరించుకొని శనివారం బొల్లారంలోని కంటో న్మెంట్ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహి స్తున్న డాక్టర్లకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్.ఎం. ఓ.రామక్రిష్ణ, వైద్యులు డాక్టర్ సత్య శీల్, హరిక్రిష్ణ, వనజ, రితిక, అనురాధ, వెంకటేశ్ పాల్గొన్నారు.

## డాక్టర్లు దేవుళ్ల వంటివారు : గజ్జెల నాగేశ్



6వ వార్డు వి.ఆర్. ఆసుపత్రి డాక్టర్లను సన్మానిస్తున్న గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్,జూలై 1 ప్రభాతవార్త: ప్రాణాలను కాపాడే దేవుడు కనిపించకపోయిన ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లు దేవుళ్లుగా భావించాలని బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ తెలిపారు. డాక్టర్స్ డేను పురస్క రించుకొని శనివారం కంటోన్మెంట్ 6వ వార్డు బోయిన్‌పల్లిలోని వి.ఆర్. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నంద కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై వి.ఆర్. ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లకు శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లసేవలను కొనియాడారు.

# ఆటోనగర్ ఇసుల లారీల అడ్డాను తొలగించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసుల వినతి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



తూర్పు కాలనీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 1 ప్రభాతవార్త : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీనందు ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం తూర్పు 22 కాలనీల సంయుక్త సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా హైకోర్టు కాలనీ కమ్యూనిటి హాల్ ప్రాంగణం చుట్టూ ఎర్పాటు చేసిన ఐరన్ మెష్ జాలిని ప్రారంభించి, కాలనీవాసులు స్వంత నిధులతో ఏర్పాటు చేసుకున్న సీ.సీ.కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ సభ్యులు సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇసుక లారీల అడ్డా తొలగించి వాళ్ల ఎదుర్కుంటున్న సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. ఇసుకలారీల అడ్డ ఎత్తివేయాలని, కొన్ని కాలనీలలో వరద కాలువలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సుష్మా వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీస్ కూడా మరొక చోటికి తరలించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ లారీల అడ్డ పోవాలి అంటే చుట్టుపక్కల కాలనీవాసుల అందరి సహాయ సహకారాలు కావాలన్నారు. అడ్డదిడ్డంగా పెడుతున్న లారీలకు భారీ జరిమానా విధించాలని ట్రాఫిక్‌అధికారులకు సూచించారు. రాత్రిపూట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తామని, రిజిస్ట్రేషన్ ఆఫీస్ కూడా తరలిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో డ్రైనేజీ సమస్యతోపాటు అన్ని సమస్యలు పరిష్కారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్, వాటర్ వర్క్స్ మేనేజర్ వినోద్, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమలరెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, ట్రాఫిక్ ఏ.సీ.పి.హరిక్రిష్ణ, ఈస్టర్న్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ మందిరంలోని అవకతవకలపై విచారణ జరిపించాలి: సింగిరెడ్డి స్వర్ణలత



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సింగిరెడ్డి స్వర్ణలత

సైదాబాద్, జులై 1 ప్రభాతవార్త: సైదాబాద్ మెయిన్ రోడ్డులో ఉన్న హనుమాన్ మందిరంలో జరుగుతున్న అవకతవకలపై వెంటనే తగిన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతా రెడ్డి శనివారం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హనుమాన్ మందిరానికి సంబంధించి న్యాయస్థానంలో కేసులు ఉన్నప్పటికీ అధికారులు రోడ్డు విస్తరణకు సంబంధించిన నష్టపరిహారం రూ.70 లక్షల చెక్కును మందిరం పూజారి రఘునాథ్ ప్రసాద్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. దీని గురించి స్థానికులు, దేవాదాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును పూజారి తిరిగి అధికారులకు ఇచ్చారని స్వర్ణలత పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, జీర్ణావస్థకు చేరిన అతి పురాతనమైన హనుమాన్ మందిరం పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ పర్యవేక్షణలో అనుమతిని మంజూరు చేయాలని ఆమె మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సైదాబాద్ మండల పరిధిలో అనుమతిలేని పాఠశాలలపై చర్య తీసుకోవాలి: సిపిఐ

సైదాబాద్, జులై 1 ప్రభాతవార్త: సైదాబాద్ మండల పరిధిలో అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలపై చర్య తీసుకోవాలని కోరుతూ ఐఎస్ సదన్ డివిజన్ సిపిఐ కార్యదర్శి షేక్ మహమూద్ శనివారం మండల విద్యాధికారి రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీనగర్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్నారని దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని షేక్ మహమూద్ కోరారు. ఈ కార్యక్రమంలో పాషా తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో త్రాగు నీటి లీకేజీలు కాకుండా సమస్యను అరికట్టాలి: కార్పొరేటర్ అరుణ



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, జులై 1 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్‌లోని సమస్యలన్నింటిని ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. బ్రహ్మానందం కాలనీలో శనివారం వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో త్రాగునీటి లీకేజి కాకుండా చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు తగిన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన బురదను సిబ్బందిచే తొలగింపచేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ అల్తాఫ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సుధాకర్, కిరణ్, కృష్ణ మురళి తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రినగర్ బ్రిలియంట్‌లో ఘనంగా ఇంటర్‌నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు



డాక్టర్ వంశీకృష్ణ, ప్రిన్సిపల్ మల్లేష్‌గౌడ్‌తో వైద్య వేషధారణలో విద్యార్థులు

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త : ఇంటర్ నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా మీర్‌పేట్ మున్సిపాలిటీలోని గాయత్రినగర్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులతో కలిసి డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి స్థానికంగా ఉన్న కృష్ణ హాస్పిటల్ డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మెరుగైన సేవలను అందించేందుకు డాక్టర్లు నిరంతరం కృషి చేస్తారని, రోగులను తమ బిడ్డలుగా చూసేది డాక్టరే ఒక్కరేని, రోగులు వైద్యులు చేసే సేవలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణాలను అడ్డుగా పెట్టి సేవలందించే డాక్టర్ వృత్తి ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు డాక్టర్ల వేషధారణలతో ఆసుపత్రి వాతావరణాన్ని తలపించారు. విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థులు డాక్టర్ వంశీకృష్ణను కలిసి వారికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.మల్లేష్‌గౌడ్, ఎఓ రోజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల చూపు బిజెపి వైపు : మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల



అందెలకు స్వాగతం పలుకుతున్న గుర్రంగూడ కార్పొరేటర్లు శంకర్, లక్ష్మారెడ్డి

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త: బిఆర్ఎస్ పాలన పట్ల విసిగిన ప్రజలు బిజెపివైపు చూస్తున్నారని పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టిన గడప గడపకు బిజెపి కార్యక్రమం శనివారం సాయంత్రం గుర్రంగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకొని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అయితే గడప గడపకు బిజెపి సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్ అమలు కానీయకుండా బిఆర్ఎస్ సర్కార్ మోకాలొడ్డిందని మండిపడ్డారు. కేంద్ర పథకాలను కాపీ కొడుతున్న కెసిఆర్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని అన్నారు. కాలనీల ప్రజలకు బిజెపి అండగా ఉండి వారి సంక్షేమానికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అందెల హామీనిచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు యాదీష్, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అందెలకు డాక్టర్లు, యాక్టర్ల మద్దతు....** అంతకు ముందు అల్మాస్‌గూడలో పాదయాత్రలు నిర్వహించిన అందెల శ్రీరాములుకు రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు సుధాకర్ శర్మ, బిజెపి డాక్టర్స్ సెల్ ప్రతినిధులతో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రొడ్యూసర్, నటుడు పసునూరి శ్రీనివాస్ తదితరులు సంఘీభావం తెలిపారు. అయితే డాక్టర్స్ డే సందర్భంగా అందెల పలువురు డాక్టర్లను సన్మానించారు.

## మీర్‌పేట్ పిఎస్ పరిధిలో ప్రశాంతంగా టిఎస్‌పిఎస్‌సి గ్రూప్-4 పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డిసిపి సాయిశ్రీకి బందోబస్తును వివరిస్తున్న ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ ఇతర పోలీసు అధికారులు

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త: రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో ఏర్పాటైన కేంద్రాల్లో శనివారం టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ -4 రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే 6792 మంది అభ్యర్థులకు గాను 5334 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో హాజరు శాతం 78.5శాతం నమోద్దైంది. కాగా జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఎల్‌బినగర్ డిసిపి సాయిశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ డిసిపికి వివరించారు.

## పదవీ విరమణ పొందిన రిటైర్డ్ సిడిఎంఎ సత్యనారాయణకు మేయర్ సన్మానం



రిటైర్డ్ అయిన సిడిఎంఎ సత్యనారాయణను సన్మానిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ కమీషనర్, డైరెక్టర్‌గా సుదీర్ఘ కాలంపాటు సేవలు అందించి పదవీ విరమణ పొందిన డాక్టర్ ఎన్.సత్యనారాయణను బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సన్మానించారు. శంషాబాద్‌లోని ఫోర్ట్ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమె కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి సత్యనారాయణను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిడిఎంఎగా సత్యనారాయణ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా బిబిఏ కోర్సు ప్రారంభం

నేరేడ్‌మెట్, జులై 1 ప్రభాతవార్త : కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఆదేశాల మేరకు 2023..24 విద్యాసంవత్సరం నుంచి మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా 60 సీట్లతో బిబిఏ కోర్సు ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ప్రారంభించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.శైలజ పేర్కొన్నారు. అదేవిదంగా దోస్త్ ద్వార ప్రవేశం పొందిన రెండవ పేజ్‌ల విధ్యార్థులు ఈ నెల 5లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని ఆమె సూచించారు. లేనిచో విద్యార్థులకు కేటాయించిన సీటు రద్దవుతుందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు జులై 5లోపు రిపోర్టింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అతితక్కువ ఫీజుతో తెలంగాణ ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధంతో కళాశాలలో అత్యుత్తమమైన అధ్యాపక బృందం విద్యా బోధన కొనసాగుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కళాశాలలో 15మంది డాక్టరేట్ డిగ్రి పొందినవారు ఉండటం చాలా సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ డా. చంద్రయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్ పాల్గొన్నారు. ఏమైన సందేహాలు ఉంటే 9392143106 ఈ నెంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

## బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : మంత్రి తలసాని



మంత్రి తలసానిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మలక్‌పేట, జూలై 1 ప్రభాతవార్త : ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 16న జరుగనున్న బోనాల ఉత్సవాలకు రావాలని ఓల్డ్ మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, తులసి సురేష్‌కుమార్, పిటి శంకర్‌ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకుడు పగిళ్ల నర్సింగ్‌లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.

## ప్రజల సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ కృషి : చైర్‌పర్సన్ అనితానాయక్

మలక్‌పేట, జూలై 1 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తున్నారని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. పోడు భూముల పంపిణీ నేపథ్యంలో మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుమారు 1.51 లక్షల మందికి ఏకంగా దాదాపు 4.60 లక్షల ఎకరాల భూమిని అందజేయడం జరిగిందన్నారు. పోడు భూముల గోడు తీర్చి గిరిజన, ఆదివాసీల ఆశలన్నీ సిఎం కెసిఆర్ నెరవేర్చారని కొనియాడారు. అడవి బిడ్డల అభ్యున్నతిలో ఇది ఒక సువర్ణ అధ్యాయమన్నారు. మావ నాటే మావ రాజ్ స్వప్నం గ్రామ పంచాయతీల ఏర్పాటుతో సాకారం అయిందన్నారు. సిఎం కెసిఆర్ జల్, జంగల్, జమీన్ అనే కొమరం భీం కలలను నెరవేర్చారని అన్నారు.

## ఇఎస్ఐ హాస్పిటల్లో డాక్టర్స్ డే వేడుకలు



వైద్యులతో ఇఎస్ఐ సూపరెండెంట్ డా. కమల

తార్నాక, జూలై 1 ప్రభాతవార్త : వృత్తి పట్ల అంకిత భావంతో పని చేస్తూ కార్మికులకు నిరంతరం సేవందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని ఇఎస్ఐ సూపరెండెంట్ డా. కమల పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఇఎస్ఐ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కమల మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సహకారంతో కార్మిక రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు తమ డాక్టర్లు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రోగులను తమ బిడ్డలుగా చూసేది డాక్టరే అన్నారు. రోగులు, ప్రభుత్వం తమ వైద్యులు చేసే నిరంతర సేవలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణాలను అడ్డుగా పెట్టి సేవలందించే డాక్టర్ వృత్తి ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఇఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్, ఆర్ఎంఓ డా.రజ్వత్ డాక్టర్లు నాగేందర్, వెంకట్‌రెడ్డి, స్వేత, రమేష్, సతీష్, నాగరాజు, వెంకటేష్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే దేవిరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

మన్సూరాబాద్, జూలై 1 ప్రభాతవార్త : మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు కాలనీలలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు 78 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై పనులను ప్రారంభించారు. వీరభోగ వసంతరాయనగర్‌లో పోలీస్ క్యాంటీన్ దగ్గర దెబ్బ తిన్న సి.సి.రోడ్లకు రిపేర్లు, నర్సరీ (రోడ్డు నెం.4 నుండి 5 లింక్ రోడ్డు) వద్ద సీ.సీ.రోడ్డు పనులకు శంకుస్థాపన, మోడల్ మార్కెట్, వార్డ్ నెం.లోని జడ్జెస్ 1 కాలనీవద్ద సహారా కాంపౌండ్‌వాల్‌దగ్గర సీ.సీ.రోడ్డు పనులు, హయత్‌నగర్ సర్కిల్-3లోని మన్సూరాబాద్‌లోని వార్డు.నెం.12, వినాయకనగర్ ఫేజ్-1లో ప్లాట్ నెం.7 నుంచి కమ్యూనిటీ హాల్ వరకు సీ.సీ.రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క ఇంటికి మంచినీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమైన నిరుపేదలు : సామ రంగారెడ్డి



కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ బ్రోచర్‌ను అందజేస్తున్న సామ రంగారెడ్డి, ఇతర నాయకులు

వనస్థలిపురం, జూలై 1 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ మహాజన్ సంపర్క్ అభియాన్ భాగంగా బీజెపి ఇంటింటి కార్యక్రమాన్ని హస్తినాపురం డివిజన్లో ద్వారకానగర్, జై క్రిష్ణ ఎన్‌క్లేవ్, ఊర్మిళనగర్, టీచర్స్ కాలనీలలో బిజెపి అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 9 సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన అందిస్తూ, ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రబుత్వం కరోనా సమయంలో ప్రతి పేదవాడి కడుపు నిండాలని 5 కిలోల ఉచిత బియ్యాన్ని నేటి వరకు అందిస్తూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 8 సంవత్సరాలలో రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో నిరు పేదలు రేషన్ బియ్యానికి దూరమయ్యారని దుయ్యబట్టారు. అదేవిధంగా రేషన్ కార్డు ఉంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌తో ప్రతి పేదవానికి 5 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని పేదవారికి దూరం చేసారన్నారు. వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రేషన్ కార్డు లేకపోవడంవల్ల వారికి పెన్షన్ దూరమైందన్నారు. జిహెచ్ఎంసి కూడా రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత దివాళా తీయించారన్నారు. నేడు జిహెచ్ఎంసి రోజుకు కోటి రూపాయలు మిత్తి కట్టవలసివస్తుందని అన్నారు. దీంతో కాలనీలలో అభివృద్ధి జరగక ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయి డ్రైనేజి, ముంపు సమస్య, మౌలిక సదుపాయాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి నిలిపివేసి చేతులెత్తేసిందన్నారు. చేసిన పనిని చేశామని చెప్పే ప్రభుత్వం భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఒకటే అని తెలిపారు. తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని.. ఒకసారి బీజేపీకి అవకాశమివ్వాలని కాలనీవాసులను ఆయన కోరారు.

## వైద్యులు ఆరోగ్య ప్రదాతలు : విజయరంగ




డాక్టర్ నగేష్ ను సన్మానిస్తున్న విజయరంగ తదితరులు

ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త : వైద్యులు ఆరోగ్య ప్రదాతలు అనే లైన్స్ క్లబ్ కొత్తపేట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా శనివారం కొత్తపేట ప్రబుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉండే విధంగా చూసేందుకు వైద్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నరేష్ ను, వైద్య సిబ్బందిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పనిగిరి సాయిబాబా దేవాలయం చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, బొగ్గరపు వరుణ్‌చంద్ర, విజయగౌడ్, కర్ణ శ్రీనివాస్, నోముల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ విద్యార్థుల సందడి



ఏరియా ఆసుపత్రి వైద్యులతో బచ్‌పన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు

వనస్థలిపురం, జూలై 1 ప్రభాతవార్త : ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా బచ్‌పన్ స్కూల్ అకాడమిక్ హైట్స్ విద్యార్థిని విద్యార్థులందరూ వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లోని ఈజెహెచ్ఎస్ సెంటర్లో డాక్టర్లను కలిసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు స్వతహాగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్‌లను వారికి అందజేసారు. ఈ సందర్భంగా వనస్థలిపురం సెంటర్ ఇన్చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యజువాన్ మహమ్మద్, డాక్టర్ శాంతికుమార్‌గౌడ్‌లను కలిసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం వైద్య బృందం పిల్లలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కాలనీలలో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా : కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్



కాలనీలలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి, జూలై 1 ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ ఉప్పలమ్మ గుడి వెనుకవైపున కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ జలమండలి మేనేజర్ నవీన్‌తో కలిసి పర్యటించారు. కాలనీవాసులు డ్రేనేజి అవుట్‌లెట్ సమస్య పరిష్కరించాలని, డ్రేనేజి ఓవర్ ఫ్లో అవుతుందని సమస్యను వెంటనే పరిష్కరించాలని, సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు. స్పందించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సంపత్‌రావు, కిషోర్, కాలనీవాసులు సూర్యప్రకాష్‌రెడ్డి, బాలాజీ, మహావీర్‌రెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, వెన్సెంట్ పాల్, రోజా రమణి, విజయలక్ష్మి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.